సాక్షి అనంతపురం

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



జడికే పరిమితం
రాష్ట్రమంతటా భారీ వర్షాలు నమోదు కాగా జిల్లాలో రెండు రోజులూ జడివానకే పరిమితమైంది.
10లో



టమాట కిలో రూ.20
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6 వేలు, సరాసరి రూ.14 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
29.2°/22.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో తేలిక పాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాలు నుంచి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో వర్షాల ప్రభావం, పంట నష్టం, విద్యుత్, హౌసింగ్, రహదారులు తదితర వాటికి సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి జిల్లాలో వర్షం భారీగా లేనప్పటికీ అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ సమయంలోనైనా అధిక స్థాయిలో వర్షం కురిసే అవకాశం లేకపోలేదన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. భారీ వర్షం కురిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కాలువలు, వంకల్లో నీటి మట్టం పరిశీలించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ జి.రామ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు
అనంతపురం అర్బన్: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు.

10న 'పొలం పిలుస్తోంది'
అనంతపురం అగ్రికల్చర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈనెల 3 నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా.. రాష్ట్రంలో చాలా జిల్లాలో భారీ వర్షాలు, వరదలు కొనసాగుతున్నందున కమిషనరేట్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. 10 నుంచి మొదలై నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి మంగళ, బుధవారం తప్పనిసరిగా పొలంబాటతో పాటు గ్రామసభల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందులో వ్యవసాయ, పట్టు, పాడి, పశుసంవర్థక, ఏపీఎంఐపీ, ఉద్యాన,మార్కెటింగ్‌శాఖ సిబ్బందితో పాటు అక్కడక్కడా శాస్త్రవేత్తలు కూడా హాజరవుతారని తెలిపారు.

ఎంబీఏ పరీక్షలు వాయిదా
అనంతపురం సెంట్రల్: ఎస్కే యూనివర్సిటీలో సోమవారం జరగాల్సిన ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 11కు వాయిదా వేసినట్లు పరీక్ష విభాగపు సంచాలకులు ఆచార్య జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అభ్యర్థులు గమనించాలని కోరారు.

సజావుగా యూపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌డీఏ, ఎన్‌ఏ, సీడీఏ పరీక్షలు సజావుగా జరిగాయి. జేఎన్‌టీయూ కేంద్రంలో కంబైన్డ్ డిఫెన్స్ పరీక్ష మూడు సెషన్లు, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ పరీక్ష రెండు సెషన్లు కేఎస్‌ఎన్ పీజీ కళాశాల కేంద్రంలో నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను జేసీ శివనారాయణ శర్మ సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు.

డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి
అనంతపురం అర్బన్: పలువురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 32 మంది ఉండగా, ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి పదోన్నతి దక్కింది. జిల్లా నుంచి కె.విజయలక్ష్మి (ఆర్‌డీఓ కార్యాలయ పరిపాలనాధికారి), ఆర్.వి.సునీతబాయి (విడపనకల్లు తహసీల్దారు) పదోన్నతి పొందారు. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి ఎం.అనుపమ (పుట్టపర్తి తహసీల్దారు)కు పదోన్నతి లభించింది. వీరికి ప్రభుత్వం త్వరలో స్థానాలను కేటాయిస్తుందని రెవెన్యూ అధికార వర్గాలు తెలిపాయి.

గుండె గుడిలో రాజన్న



ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నది కేవలం ఐదేళ్ల మూడు నెలలే. అయినా, మంచి చేయాలన్న మనసుంటే ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో ఆ కొద్ది కాలంలోనే చేసి చూపారు. అన్నదాతలకు ఆత్మబంధువయ్యారు. పంట ఎండినా నష్టపోమనే ధీమా కల్పించారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించారు. పేద విద్యార్థులకు బాసటగా నిలిచారు. జలయజ్ఞంతో బీడు భూములను సస్యశ్యామలం చేశారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకూ పథకాలు దరి చేర్చి ఆపన్న హస్తం అందించారు. అందుకే మహానేత మరణించి 15 యేళ్లు కావస్తున్నా అందరి మదిలో నేటికీ కొలువై ఉన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ 15వ వర్ధంతి



హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద నిర్మించిన లిఫ్ట్

అనంతపురం అగ్రికల్చర్: వర్షాలు లేవు, పంటలు పండటం లేదు, పెట్టుబడులు కూడా దక్కడం లేదు. ఇంటింటా అప్పుల కుప్పలు పెరిగాయి. పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఎలా చేయాలో తెలియడం లేదు. చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ కూడా భారమైపోయింది. లక్షల మంది పొట్ట చేత పట్టుకుని పక్క రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారు. అప్పులు తీర్చ లేక చాలా మంది రైతులు పురుగుల మందు తాగి, తోటలోనే చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలొదులుతున్నారు. 1993 నుంచి 2004 మధ్య కాలంలో వరుస కరువులు విలయ తాండవం చేయడంతో 'అనంత'లో విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ప్రకృతి ప్రకోపం, మరో పక్క పాలకుల చిన్నచూపు కారణంగా 'అనంత' ప్రజలు, రైతులు దయనీయ స్థితిలో ఉన్న వేళ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశా కిరణంగా కనిపించారు. 2004 ఎన్నికల్లో అఖండ విజయంతో సీఎంగా బాధ్యతలు చేపట్టి, అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించి అందరి బంధువుగా చరిత్రలో నిలిచారు.

- వ్యవసాయాన్ని పండుగలా మార్చిన దివంగత నేత వైఎస్సార్
- ఉచిత విద్యుత్, రుణమాఫీ, బీమా, సూక్ష్మసాగుతో రైతు ఇంట సంక్షేమం
- ఆరోగ్య శ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం
- 108, 104 వాహనాలతో ప్రజల చెంతకే వైద్య సేవలు
- ఆయన హయాంలోనే సాగు, తాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం
- చాగళ్లు, పెండేకల్లు, జీడిపల్లి రిజర్వాయర్లు పూర్తి
- పీఏబీఆర్‌కు 10 టీఎంసీలు వచ్చేలా కృషి
- పాలనకు మానవతను జోడించి అందరిలో చెరగని ముద్ర

ఉచిత కరెంటుతో ఊపిరి..
2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వేదికపైనే ఉచిత కరెంటు, విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తూ తొలి సంతకంతోనే వ్యవసాయానికి ఊపిరి పోశారు మహానేత వైఎస్సార్. అలా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.70.65 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ కాగా.. ఐదేళ్లు 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ. వందల కోట్ల విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. 2004కు ముందు రూ. 1,000 కోట్ల లోపున్న పంట రుణాలను రూ.6,594 కోట్లకు చేర్చారు. పావలా వడ్డీ కింద రూ.44 కోట్లు ఇచ్చారు.

పంటల బీమాతో ధీమా..
2004కు ముందు అప్పటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా పథకాన్ని వైఎస్సార్ రైతులకు మేలు జరిగేలా మార్పు చేసి అంతులేని ధీమా కల్పించారు. 2004–2009 మధ్య వైఎస్ హయాంలో వేరుశనగ రైతులకు పంట కోత ఫలితాల ఆధారంగా బీమా కింద ఏకంగా రూ.1,138 కోట్ల పరిహారం ఇచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.100 కోట్లు అందించారు.

ఒకే విడతలో రుణమాఫీ..
2008లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నందున కేంద్ర ప్రభుత్వం సహకారంతో వైఎస్ ప్రభుత్వం 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్ల రుణాలు ఒకేవిడతలో మాఫీ చేసింది. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన రైతులకు కూడా ప్రోత్సాహకాల కింద 3,61,269 మందికి రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందజేశారు. మొత్తమ్మీద రుణమాఫీ, ప్రోత్సాహకాల కింద ఒకే విడతగా 6,65,206 మంది రైతులకు రూ.625 కోట్ల ప్రయోజనం కల్పించారు.

విత్తన రాయితీలు..
ఏటా ఖరీఫ్, రబీలో రైతులకు లక్షల క్వింటాళ్ల వేరుశనగ, పప్పుశనగ, కంది, ఇతర విత్తనాలు రాయితీతో ఇచ్చారు. 2004– 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్ల వేరుశనగ అందించడంతో పాటు కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు.

అనుబంధ రంగాలకు ప్రాధాన్యత..
వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్లతోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూతను అందించడంతో ఈ రంగాలు కూడా పురోగతి సాధించాయి. రూ.25 కోట్ల రాయితీ ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీరవిప్లవానికి శ్రీకారం చుట్టారు. 40 వేల హెక్టార్ల పండ్లతోటల విస్తరణకు రూ.80 కోట్ల సబ్సిడీ ఇచ్చారు. దీంతో అప్పట్లోనే 'ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీ'గా పేరొచ్చింది. బిందు, తుంపర సేద్యం పరికరాలు ఎస్సీ ఎస్టీలకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో అందజేశారు. సూక్ష్మసేద్యం విస్తరణకు రూ.280 కోట్ల రాయితీ ఇవ్వడంతో 1.13 లక్షల హెక్టార్లకు చేరుకుంది.

సీమ కోసం 'జలయజ్ఞం'
అనంతపురం సెంట్రల్: జిల్లాలో కరువు నిర్మూలన కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పథకాన్ని యజ్ఞంలా కొనసాగించారు. నీలం సంజీవరెడ్డి హయాంలో నిర్మించిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆధునికీకరణతో పాటు కేవలం తాగునీటి పథకంగా ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని సాగునీటి పథకంగా మార్చి దాదాపు ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ.3,185 కోట్లతో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందించేలా పథకాన్ని చేపట్టారు. ఆయన చలువతోనే నేడు ఏటా శ్రీశైలం జలాశయం నుంచి 20 నుంచి 35 టీఎంసీల వరకూ కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయి. తుంగభద్ర జలాశయం నుంచి అత్యధిక నీరు జిల్లాకు వచ్చేందుకు రూ. 590 కోట్లతో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా పెద్దపప్పూరు మండలంలో రూ. 244 కోట్లతో చాగల్లు ప్రాజెక్టు, రూ. 99 కోట్లతో పెండేకల్లు ప్రాజెక్టు నిర్మించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణతో పాటు పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 10 టీఎంసీల తుంగభద్ర జలాలను కేటాయించారు. కేసీ కెనాల్ కోటాను పీఏబీఆర్‌కు మళ్లించి.. పోతిరెడ్డిపాడు నుంచి కేసీ కెనాల్‌కు 10 టీఎంసీలు వాడుకునేలా 2006లో నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్ పుణ్యమా అని ప్రతి ఏడాది 5 నుంచి 6 టీఎంసీల నీరు పీఏబీఆర్‌కు అదనంగా అందుతున్నాయి.

నేడు వైఎస్సార్ వర్ధంతి
అనంతపురం కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 9.30 గంటలకు అనంతపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జెడ్పీ వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

పేదల ఆరోగ్యానికి భరోసా
అనంతపురం మెడికల్: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఆరోగ్య శ్రీ, 108, 104 పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాయి. అప్పటివరకూ కార్పొరేట్ ఆస్పత్రుల మెట్లు కూడా ఎక్కని పేద ప్రజలకు.. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పైసా ఖర్చు లేకుండా వాటిల్లోనే ఉచితంగా ఖరీదైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు డాక్టర్ వైఎస్సార్. ఆయన హయాంలోనే చికిత్సల పరిధిని 860కి పెంచారు.

- ప్రమాదాల్లో గాయపడిన వారిని, అత్యవసరంగా సేవలు అవసరమైన రోగులను తక్షణమే ఆస్పత్రులకు తరలించేలా వైఎస్సార్ హయాంలో 2005 ఆగస్టులో 108ను ప్రవేశపెట్టారు.రోడ్డు ప్రమాదాలు,పాయిజన్, పాముకాటు తదితర ప్రాణాపాయ కేసులతో పాటు గర్భిణులు, బాలింతలు, రోగులను గోల్డెన్ అవర్‌లో నేటికీ 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఫోన్ చేస్తే క్షణాల వ్యవధిలో రోగుల వద్దకే వెళ్లి సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణం పోస్తోంది 108. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 66 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి.
- పీహెచ్‌సీలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించేందుకు 104 పథకాన్ని ప్రవేశపెట్టారు. నెలలో 24 రోజులు గ్రామాలకు వెళ్లి వైద్యం అందించేలా పథకానికి రూపకల్పన చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 36 వాహనాలతో పాటు ఒక బ్యాకప్ వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. నెలలో జిల్లాలోని 433 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను రెండు సార్లు కవర్ చేసేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

తండ్రికి మించి తనయుడు..
ఎంతో గొప్ప ఉన్నతాశయంతో తన తండ్రి తీసుకొచ్చిన పథకాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆరోగ్య శ్రీ వైద్య చికిత్సల పరిధిని 3,256కి తీసుకెళ్లారు. ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడమే కాకుండా మందులూ అందించారు. 'ఆసరా' పేరుతో రోగికి నగదు సాయం చేసి అండగా నిలిచారు. దీంతో పాటు ప్రతి మండలానికి 108 వాహనం ఉండేలా చర్యలు తీసుకున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలను సమకూర్చారు.



జీవన పోరాటం
ఈయన పేరు దూదేకుల బాబా. వయసు 68 ఏళ్లు. అనంతపురం పాతూరులో ఉంటున్నారు. మోకాలి చిప్పలు అరిగిపోయాయి. అయినా నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లాలంటే కాయాకష్టం తప్పనిసరి. ఇలా రిక్షా లాగుతూ జీవన పోరాటం కొనసాగిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

దులీప్ ట్రోఫీ మ్యాచులకు పటిష్ట భద్రత

- ఎస్పీ జగదీష్



ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం కార్పొరేషన్/సెంట్రల్: దులీప్ ట్రోఫీని పురస్కరించుకుని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌ను ఎస్పీ పరిశీలించారు. పార్కింగ్ స్థలం, మైదానం, గ్యాలరీతో పాటు నగరంలో క్రీడాకారులు బస చేయనున్న మాసినేని, అలెగ్జాండర్ హోటళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులతో పాటు దేశంలోనే టాప్ 45 మంది క్రికెట్ ప్లేయర్లు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 5 నుంచి 22 వరకు స్టేడియం బయట, లోపల కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మ్యాచులు ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్టేడియంలోకి ల్యాప్‌టాపులు, కెమెరాలు, అగ్గిపెట్టెలు, బైనాక్యులర్లు, బ్యాటరీలు, బ్యాగులు, సిగరెట్లు, లైటర్లు, హెల్మెట్లు, నీళ్ల బాటిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. క్రీడాకారులు బస చేసే ప్రాంతాల నుంచి స్టేడియం చేరుకునే వరకూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, లైజనింగ్ ఆఫీసర్లకు సూచించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ రోహిత్‌వర్మ, అడ్మిన్ మేనేజర్ ఆదిత్య వర్మ, లాజిస్టిక్ మేనేజర్ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'యూపీఎస్'ను వ్యతిరేకిస్తూ నిరసన



నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్‌కు సంబంధించి యూపీఎస్ విధానాన్ని కేంద్రం తీసుకురావడాన్ని నిరసిస్తూ సెప్టెంబరు 1ని 'పెన్షన్ విద్రోహ చీకటి దినం'గా ఏపీటీఎఫ్ అభివర్ణించింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడులకు తలొగ్గి ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ అని పేర్లు మారుస్తూ మభ్యపెడుతున్నారన్నారు. లక్షలాది మంది ఏకైక నినాదమైన ఓపీఎస్‌ను మాత్రమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నరేష్, సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్‌వలి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటిగారి వన్నప్ప, నాయకులు రంగనాయకులు చిదంబరెడ్డి, పట్నం శ్రీనివాసులు, సూర్యనారాయణ, పుల్లయ్య, హిమగిరి ప్రసాద్, చిదంబరయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. అంజన్న బ్రహ్మ రథోత్సవం



స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: పవిత్ర పుణ్యక్షేత్రమైన నేమకల్లులో అంజన్న బ్రహ్మ రథోత్సవం రమణీయంగా సాగింది. అర్చకులు ఆదివారం ఉదయం స్వామికి బంగారు కిరీటం, వెండి పాదాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ, గంగాభిషేకం శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి బ్రహ్మ రథంపై కొలువుదీర్చారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాది భక్తుల ఆంజనేయ నామస్మరణ నడుమ బ్రహ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథంపై భక్తులు అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భక్తులతో కలిసి రథం లాగారు. బళ్లారి బాలాజి జిరాక్స్ సెంటర్ వారు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు ఆలయం వద్ద లంకా దహనం కార్యక్రమం ఘనంగా జరిగింది. రథోత్సవం సందర్భంగా ఎస్‌ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్ పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఎస్టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీం) పథకం వలన ఉపాధ్యాయులకు కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమీలేదన్నారు. రకరకాల పింఛన్ పథకాలను ప్రవేశ పెడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్స్ కృష్ణమోహన్, మునిసిపల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఫణి భూషణ్, నాయకులు గోవిందు, రాజ శేఖర్, బాబ్జీ నాయక్, డేనియలు, రామకృష్ణ, మల్లికార్జున, మురళీకృష్ణ, సురేష్ కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి



పెద్దవడుగూరులో మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు

గుత్తి రూరల్/పెద్దవడుగూరు: అధిక వర్షాల నేపథ్యంలో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకొని పంటలను కాపాడుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నరశింహారావు, గుత్తి ఉద్యాన అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. గుత్తి మండలంలోని కొత్తపేట, పెద్దవడుగూరు మండలంలో వారు పర్యటించారు. కూరగాయలు, మిరప పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. డీహెచ్ఓ, హెచ్ఓ మాట్లాడుతూ కూరగాయల పంటలలో వర్షం నీరు నిల్వ ఉండకుండా తాత్కాలిక కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల దగ్గర మట్టిని ఎగదోయాలన్నారు. వేరుకుళ్లు ఆశించిన పంటలకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, 10 లీటర్ల నీటిలో కలిపి ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. మిరప పంటలో నీరు అధికంగా ఉన్న పొలాల్లో 3 గ్రాములు 19:19:19 మరియు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. టమాటా పంటకు వ్యాపించే వేరుకుళ్లు, బాక్టీరియా తెగుళ్ల, ఫంగల్ తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మావిరిడి 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

సాగునీటిలో ఎన్నికల వేడి!

సాగునీటి సంఘాల్లో ఎన్నికల వేడి మొదలైంది. మూడు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తిచేసేలా రాష్ట్ర మంత్రి వర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. సాగునీటి సంఘాలు, వాటి పరిధిలోని (రైతుల) ఓటర్లు, విస్తీర్ణంపై లెక్కలు తేలుస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా సమగ్ర వివరాలు సిద్ధం చేసుకునేలా కసరత్తు మొదలుపెట్టారు.

- సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు
- మూడు వారాల్లో మార్గదర్శకాలు
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలంటూ రైతు సంఘాలు డిమాండ్
- ప్రాజెక్ట్ చైర్మన్ కుర్చీల కోసం పైరవీలు మొదలెట్టిన కూటమి నేతలు



బీటీప్రాజెక్ట్



ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు ప్రవహిస్తున్న నీరు

సాగునీటి సంఘాలు, ఆయకట్టు వివరాలు

జిల్లా	నీటి సంఘాలు	విస్తీర్ణం	ప్రాజెక్టులు	విస్తీర్ణం (మైనర్/హెచ్ఎల్సీ)
అనంతపురం	137	1,074,821	01	12,400
శ్రీ సత్యసాయి	214	58,256	03	29,054

రాయదుర్గం: సాగునీటి సంఘాలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015 సెప్టెంబర్ మాసంలో ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో అధికార దర్పంతో మెజార్టీ సంఘాలను కైవసం చేసుకున్నారు. దీనిపై రైతుల్లో పెద్ద ఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. ఈ కారణంగా గడిచిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం వాటి జోలికి వెళ్లలేదు. రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి వాటి ద్వారా అన్ని రంగాల్లోనూ సమన్వయం చేస్తూ ముందుకు నడిపించారు. తాజాగా మళ్లీ సాగునీటి సంఘం ఎన్నికలు తెరపైకి వచ్చాయి. నీటి సంఘాలకు రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 89 మైనర్ ఇరిగేషన్, 48 హెచ్ఎల్సీ పరిధిలోని మొత్తం 137 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఇందులో 10,45,000 ఎకరాల్లో ఆయకట్టు విస్తీర్ణం ఉంది. బీటీ ప్రాజెక్ట్ పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూటర్లకు ఎన్నికలు జరుగుతాయి. వారంతా కలసి ప్రాజెక్ట్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. 12,400 ఎకరాల ఆయకట్టు ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలోని అప్పర్‌పెన్నార్ ప్రాజెక్ట్ పరిధిలో 5 డీసీ చైర్మన్లు, 10,048 ఎకరాలు, యోగివేమన (వైవీఆర్) రిజర్వాయర్ పరిధిలో 6 డీసీ చైర్మన్లు, 12,880 ఎకరాలు, పెన్నార్ కుముద్వతి ప్రాజెక్ట్ పరిధిలో 5 డీసీ చైర్మన్లు 6,126 ఎకరాల్లో ఆయకట్టు విస్తీర్ణం ఉంది. డీసీ చైర్మన్లలో మెజార్టీ సభ్యులు ప్రాజెక్టు చైర్మన్లను ఎన్నుకుంటారు.

ఎన్నిక ఇలా..

నీటి సంఘాల పరిధిలో ఆరుగురు సభ్యులు ఉంటారు. ఎన్నికైన ఆరు మంది టీసీ మెంబర్లు డిస్ట్రిబ్యూటరీ (డీసీ) కమిటీ అధ్యక్షులను ఎన్నుకుంటారు. డీసీ అధ్యక్షులు ప్రాజెక్టు చైర్మన్లను ఎన్నుకుంటారు. ఒక్కో టీసీ మెంబర్ పరిధిలో సుమారు 250 నుంచి 300 ఓటర్లు ఉంటారు. అధ్యక్షుడి నియమకానికి ఆరు టీసీ మెంబర్లు అవసరం. డీసీ అధ్యక్షుడి కోసం సుమారు 1800 నుంచి 2 వేల ఓట్లు ఉంటాయి. 351 సంఘాలకు సుమారు 7,02,000 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. నాలుగు ప్రాజెక్టుల పరిధిలోని 22 మంది డీసీ అధ్యక్షులు ఉంటారు. ఒక్కో డీసీ పరిధిలో సుమారు 2 వేల ప్రకారం 44,000 వేల మంది ఓటర్లు ఉంటారు. ఈ లెక్కలు సమగ్రంగా తేల్చేలా అధికారులు ఓటరు జాబితా తయారీలో నిమగ్నమయ్యారు.

ఏకపక్షం కాదు ఏకాభిప్రాయంతోనే ఎన్నికలు

ఏకాభిప్రాయంతో కాదు.. అంతా ఏకపక్షమై సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేలా 2013లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో 2015 సెప్టెంబర్‌లో చంద్రబాబు సర్కారు హడావుడి చేస్తూ ఏర్పాట్లు చేసింది. టీడీపీకి అనుకూలంగా మార్చుకునేలా ఏపీ ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ (ఈఎస్ సిస్టమ్స్ యాక్ట్-1997)కు సవరణ చేస్తూ ఏకాభిప్రాయం పేరిట చీకటి జీఓను తెరపైకి తెచ్చింది. రైతుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏం చేయాలనే అంశం జీఓలో స్పష్టత ఇవ్వలేదు. దీన్ని అధికార పార్టీ నేతలు అసరాగా చేసుకున్నారు. ఏకాభిప్రాయం ముసుగులో తమ అనుయాయులకు పదవులన్నీ కట్టబెట్టారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతు సంఘాలు అడ్డగించినా ఎన్నిక ప్రక్రియ ముగించేశారు. దీంతో రైతుల మధ్య ముష్టియుద్దాలు నడిచాయి. ప్రస్తుత ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేలా కృషి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్ట్ చైర్మన్ కుర్చీపై కన్ను..

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కీలకంగా చెప్పుకునే బీటీ ప్రాజెక్ట్ చైర్మన్ కుర్చీపై బడా నేతల కన్ను పడింది. దాన్ని ఎలాగైనా దక్కించుకునేలా కొందరు పైరవీలు మొదలెట్టారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట (ఎడమ), బ్రహ్మసముద్రం (కుడి) కాలువ ల పరిధిలోని 12,400 ల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ కాలువ పరిధిలోని 24 టీసీ మెంబర్లు, 4 డిస్ట్రిబ్యూటరీల చైర్మన్లు ఉంటారు. కుడి కాలువ పరిధిలోని 12 టీసీ మెంబర్లు, ఇద్దరు డిస్ట్రిబ్యూటరీల చైర్మన్లు ఉంటారు. ఆరు మంది డీసీ చైర్మెన్లు కలసి ప్రాజెక్టు చైర్మెన్‌ను ఎన్నుకుంటారు. సత్యసాయి జిల్లాలోని అప్పర్‌పెన్నార్, వైవీఆర్, పెన్నార్‌కుముద్వతి ప్రాజెక్టుల పరిధిలోనూ చైర్మన్ సీటుకు పోటీ మొదలైంది.

సాగునీటి సంఘాల వివరాలు సిద్ధం..

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జిల్లా మైనర్ ఇరిగేషన్, హెచ్ఎల్సీ ఎస్ఈ లు విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ జరిపే విధానం షెడ్యూల్‌లో విడుదల కావాల్సి ఉందన్నారు.

జడికే పరిమితం

అనంతపురం అగ్రికల్చర్: వాయుగుండం ప్రభావంతో రాష్ట్రమంతటా భారీ వర్షాలు నమోదు కాగా జిల్లాలో రెండు రోజులూ జడికే పరిమితమైంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు అన్ని మండలాల్లో తంపర్లు పడ్డాయి. పెద్దవడుగూరు, యల్లనూరు, డి.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు, గార్లదిన్నె, వజ్రకరూరు, విడపనకల్, కూడేరు, ఉరవకొండ తదితర మండలాల్లో మోస్తరుగా, మిగతా ప్రాంతాల్లో తేలికపాటి జడి కురిసింది. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ నమోదు కావాల్సి ఉంది. తొలిరోజు 3 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదైంది. జూన్, ఆగస్టులో మంచి వర్షాలు పడటంతో సాధారణం కన్నా అధిక వర్షపాతం రికార్డయింది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 30 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండగా, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షపాతం నమోదు కావొచ్చన్నారు.

వైద్య సేవలకు కంట్రోల్ రూం

- ఫోన్ నంబర్ 08554-277434

అనంతపురం మెడికల్: వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. జిల్లాలో ఎక్కడైనా పాముకాట్లు, గర్భిణీ స్త్రీలు, కరెంటు షాక్‌కు గురైన వారు తదితర సమస్యలతో బాధపడే ఎవరైనా కంట్రోల్ రూంను సంప్రదించవచ్చన్నారు. తద్వారా ఆయా పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులను అప్రమత్తం చేసి మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 24 గంటలూ కంట్రోల్ రూం పని చేస్తుందన్నారు.

జనగణమన కోసం ఒక్క నిమిషం ఆగుదాం



ప్లకార్డు చేతపట్టి ప్రచారం చేస్తున్న జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు హంజాహుసేన్

తాడిపత్రి అర్బన్: జాతీయ గీతం జనగణమన కోసం ఒక్క నిమిషం ఆగుదామని జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు హంజాహుసేన్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టాడు. తాడిపత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోజూ ప్రధాన కూడళ్లలో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పాదాచారులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ఆదివారం స్థానిక అశోక్ పిల్లర్ వద్ద జాతీయ గీతాలాపనలో అనంతపురానికి చెందిన జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు హంజాహుసేన్ పాల్గొని అందరితో పాటు జాతీయ గీతాన్ని ఆలపించాడు. అంతకుముందు హంజాహుసేన్ జనగణమన కోసం ఒక్క నిమిషం ఆగుదాం అన్న ప్లకార్డును చేతపట్టి సీబీ రోడ్డులో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టాడు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు హంజాహుసేన్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పీవీ సుబ్రమణ్యం, కార్యదర్శి రఫీ, జనగణమన కమిటీ అధ్యక్షుడు కిషోర్, సభ్యులు ఇస్మాయిల్, షాకీర్‌బాషా, రంగయ్య, అలీ తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్ వినోద్‌కుమార్



పెద్దవడుగూరు ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దవడుగూరు: మండల కేంద్రమైన పెద్దవడుగూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. నదీ పరివాహక ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, ఓపీ గది, బాలింతల గదులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పని చేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధులకు గైర్హాజరైన డాక్టర్, ఫార్మాసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారు? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందులు నిల్వ ఉన్న గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో శిథిలావస్థకు చేరిన గదుల వివరాలను డాక్టర్ శ్రీనివాసబాబుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఆస్పత్రిని ప్రారంభించడానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారో విచారించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్డీటీ కాలనీలోని గర్భిణీ బిందు ఉంటున్న ఇంటికి వెళ్లి ఆమె యోగక్షేమాలను అడగడంతో పాటు ఆస్పత్రిలో సేవలన్ని అందుతున్నాయా? లేదా? అని కనుక్కున్నారు. తమకు ఇళ్లు లేదని మంజూరు చేయాలని విన్నవించగా.. వివరాలు సేకరించి లిస్టులో పెట్టాలని హౌసింగ్ ఏఈ నెట్టికంటయ్యను ఆదేశించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



వడ్డే అశోక్ (ఫైల్)



అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: అప్పుల బాధ తాళలేక ఉరివేసుకుని కౌలు రైతు వడ్డే అశోక్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఆదివారం చేటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. కొనకొండ్లకు చెందిన వడ్డే అశోక్ (29) బీటెక్ పూర్తిచేశాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ ఫ్రం హోం చేసేవాడు. అయితే ఏడాదిన్నర క్రితం ఉద్యోగాన్ని వదిలేసి తండ్రి వడ్డే కృష్ణమూర్తితో కలిసి వ్యవసాయం చేసేవాడు. సొంత పొలం లేకపోవడంతో బంధువులకు చెందిన 15 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తుండేవారు. 15 ఎకరాల్లో మిరప సాగు చేశారు. పంట పెట్టుబడికి తొమ్మిది లక్షల వరకూ అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మిరప పంటకు ధర లేకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక రోజూ మదనపడుతుండేవాడన్నారు. అలాగే ఏడాది క్రితం తన సోదరి రాజేశ్వరి వివాహానికి మరో రూ.3 లక్షల దాకా అప్పు చేశాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపనకు గురై ఆదివారం తెల్లవారుజామున ఇంట్లోని ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వజ్రకరూరు ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆలస్యంగా నడిచిన మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు



గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌కు ఆలస్యంగా వచ్చిన మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

గుత్తి: మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం 2.15 గంటల ఆలస్యంగా గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. భారీ వర్షాల కారణంగా రైలు ఆలస్యంగా వచ్చిందని రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మచిలీపట్నం నుంచి గుత్తి రైల్వే ఫోర్ట్ స్టేషన్‌కు ఉదయం 7.50 గంటలకు రావాల్సి ఉండగా 10.05 గంటలకు వచ్చింది. ముందుగా రైల్వే అధికారులు ప్రకటన చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

గీజర్ ఆన్ చేస్తుండగా 'షాక్'

- టీడీపీ నాయకుడి భార్య మృతి



సుజాతమ్మ (ఫైల్)

గుత్తి: పట్టణంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముండే టీడీపీ సీనియర్ నాయకుడు, జనతా మార్ట్ నిర్వాహకుడు కేశవనాయుడు సతీమణి సుజాతమ్మ (47) ఆదివారం గీజర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై కుప్పకూలింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు స్థానికంగానే ఉండగా, మరో కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. సుజాతమ్మ మృతదేహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా నివాళులర్పించారు.

తాగుడు మానుకోమన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

కణేకల్లు: తాగుడు మానుకోమని కట్టుకొన్న భార్య, తల్లి బుద్ధి మాటలు చెప్పడంతో ఓ వ్యక్తి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటన కణేకల్లు మండలంలోని 43 ఉడేగోళం గ్రామంలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగమధు వివరాలమేరకు.. 43ఉడేగోళం గ్రామానికి చెందిన బోయ చిక్కన్న (30) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య లక్ష్మీతో పాటు నలుగురు కూతుళ్లున్నారు. కూలీపని చేసి సంపాదించిన డబ్బాంత తాగుడుకే వెచ్చిస్తుండటంతో భార్య లక్ష్మీ తాగుడు మానుకోమని పలుమార్లు సూచించింది. గత నెల 29న ఇంటికి తాగొచ్చిన భర్తకు ప్రవర్తన మార్చుకోమని చెప్పింది. భర్త తన మాటను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అదే ఊళ్లో ఉన్న తన పుట్టింటికి ఆమె వెళ్లిపోయింది. దీంతో తల్లీ మారెక్క శనివారం కొడుకును మందలించింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చిక్కన్న పురుగుల మందును సేవించాడు. ఇంట్లో అపస్మారకస్థితిలో పడి ఉన్న చిక్కన్నను స్థానికుల సాయంతో తల్లీ బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

'ఊజీ'తో తగ్గుతున్న పట్టుగూళ్లు ఉత్పత్తి



పట్టు పురుగుపై కాటు వేస్తున్న ఊజీ ఈగ

అనంతపురం అగ్రికల్చర్: పట్టుగూళ్ల ఉత్పత్తిపై ఊజీ ప్రభావం అధికంగా ఉండటంతో మల్బరీ రైతులకు నష్టం జరుగుతోందని ప్రాంతీయ పట్టు పరిశోధనా స్థానం (రీజనల్ సెరికల్చర్ రీసెర్చ్ సెంటర్-ఆర్ఎస్ఆర్ఎస్) పరిశోధక విద్యార్థులు వై.ప్రవీణ్‌రెడ్డి, యు.అనిల్‌కుమార్, ఎం.పరశురాముడు, కె.నందిని తెలిపారు. ఎస్కే యూనివర్సిటీలో ఎంఎస్సీ సెరికల్చర్ పూర్తి చేసి ఆర్ఎస్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్ నేతృత్వంలో పట్టుకు సంబంధించిన అంశాలపై పరిశోధన విద్యార్థులుగా పనిచేస్తున్నారు. పరిశోధన ఫలితాల గురించి తెలియజేశారు.

వర్షాకాలంలో అధికం..

ఊజీ ఈగ మల్బరీ పురుగులను ఏడాది పొడవునా ఆశిస్తున్నా... వర్షాకాలంలో వాటి ఉధృతి అధికంగా ఉంటుంది. ఇది ఆశిస్తే 15 శాతం వరకు పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఊజీ ఆశించిన పట్టు పురుగు శరీరంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. పట్టుగూళ్లకు అయితే కొనభాగంలో గుండ్రటి రంధ్రం ఏర్పడుతుంది. ఇది 400 నుంచి 500 గ్రుడ్లు పెడుతుంది. 6 నుంచి 8 రోజులు లార్వాదశలోనూ, 10 నుంచి 12 రోజులు ప్యూపాదశలో ఉంటుంది. 12 నుంచి 20 రోజుల పాటు ప్రౌడ ఈగ జీవిస్తుంది. మొత్తంగా దీని జీవిత కాలం 12 నుంచి 20 రోజుల వరకూ ఉంటుంది.

నివారణ చర్యలు..

రేషం పురుగులు పెంచే షెడ్డు వాకిళ్లు, కిటికీలు జాలరీ, నైలాన్‌నెట్ బిగించాలి. గదులకు స్వయం చాలిత తలుపులు బిగించాలి. షెడ్డులోకి ఊజీ ఈగలు ప్రవేశించకుండా నిర్బంధగదిని ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. పసుపు రంగు ద్రావణంతో ఎరలు ఏర్పాటు చేసి మగ, ఆడ ఈగలను ఆకర్షించేలా చేయాలి. జీవనియంత్రణ పద్ధతిలో ఇంటి ఈగల ప్యూపాల నుంచి తయారు చేసిన నిసోలింక్స్ థైమస్ అనే పరాన్ని జీవిని నైలాన్‌వలలో చిన్న సంచిలాగా ఏర్పాటు చేసుకోవాలి. 50 మి.లీ ఇలాంటి వాటిని రూ.50కే అందుబాటులో ఉన్నాయి. పట్టుపురుగుల విసర్జన పదార్థాలు బహిరంగ ప్రదేశాలలో వేయకుండా వాటిని ప్లాస్టిక్ కవర్లలో పెడితే 15 నుంచి 20 రోజుల తర్వాత వాటి నుంచి బయటకు వచ్చిన ఊజీ ఈగలను నశింపజేయాలి.

సందడిగా అ'పూర్వ' సమ్మేళనం



వజ్రకరూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాటి విద్యార్థులు



ఒకప్పటి ఉపాధ్యాయులతో గుంతకల్లు రైల్వే హైస్కూల్ పూర్వ విద్యార్థులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని కాటా వేంకటప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1956-1969 సంవత్సరాల్లో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న వారంతా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో నివసిస్తూ చాలా మంది ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారై ఉండటం విశేషం. అందరూ కలిసి వచ్చి పాఠశాలలో చదివినప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇందులో భాగంగానే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పగడాల చంద్రశేఖర్, మురుకొండ నాగన్న, గుదే హనుమప్ప, పట్టాభాజాపీరా, మల్లిఖార్జునశాస్త్రి, పి.లింగమ్మ, శ్రీలక్ష్మి తదితరులు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాల అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషిచేస్తామని వెల్లడించారు. సర్పంచు మోనాలిసా, ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, హెచ్ఎంలు స్వర్ణలత, నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే హైస్కూల్‌లో...

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే హైస్కూల్‌లో 2003లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావుతో పాటు నాటి గురువులు ఎల్‌హెచ్ సుధాకర్, మహమ్మద్, రఫీక్, రెడ్డి, సాయికుమారీ, గుప్తా, సాధిక్, రమణరావులను ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులు కలియ తిరిగి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరిస్తూ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. సుమన, కిరణ్, మహమ్మద్, లక్ష్మీ ప్రకాష్, అలమ్, రత్తమ్మ, వాజీద్, జయలక్ష్మీ, ప్రకాష్, భాస్కర్, ప్రవీణ్, చాము తదతరులు ఈ కలయికలో ముఖ్యపాత్ర షోషించారు.

క్లుప్తంగా

కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అన్నారు. నిత్యావసర ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఈనెల 6న ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో ఆర్థిక భారాలతో పేద, మధ్యతరగతి వర్గాల జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఈనెల 6న తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల ఎదుట సీపీఐ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా తలపెట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణ స్వామి, కార్యవర్గ సభ్యులు లింగమయ్య, నారాయణస్వామి, శ్రీరాములు, సంతోష్‌కుమార్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలపై నోరు మెదపరా?

అనంతపురం టవర్‌క్లాక్: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తెలుగు తల్లి విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నా ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నోరు మెదపలేదన్నారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఐఎంఎం బాషా, న్యాయవాది హరి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జేసీబీతో పూడికతీత పనులు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ

రాప్తాడు: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు సూచించారు. ఆదివారం రాప్తాడు పంచాయతీలో ముస్లిం మైనార్టీ కాలనీలో ఇళ్ల మధ్యలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు వెంటనే మండల స్థాయి అధికారులతో కలిసి కాలనీకి చేరుకున్నారు. జేసీబీతో కాలువలో పూడికను తీయించడంతో నీరు దిగువ ప్రాంతానికి చేరింది. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, పీఆర్ ఇంజినీర్ ఓబుల్‌దాస్, సర్పంచు సాకే తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివకృష్ణ సూచించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మ్యాన్ హోల్స్ వద్ద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురైనా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం 90148 88316 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించాలి

అనంతపురం టవర్‌క్లాక్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్, షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కటిక జయరాం అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఓపీఎస్ కోసం ఉద్యోగ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నారాయణ స్వామి, ఆంజనేయులు, సునిత, శాంతిముని, ఓంకార్, గంగాధర్, శాంతిస్వరూప్, నరసింహులు, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

- డిక్లరేషన్ పత్రాలు అందజేసిన అధికారులు
- అభివృద్ధికి పాలకవర్గం ముందుంటుంది
- మేయర్ వసీం



స్టాండింగ్ కమిటీ సభ్యులకు డిక్లరేషన్ పత్రాలు అందజేస్తున్న అధికారులు, చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: ఊహించిన విధంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం నగరపాలక సంస్థలో మేయర్ వసీం సమక్షంలో అదనపు కమిషనర్ శ్రీహరి బాబు స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లేమీద నరసింహులు, రహంతుల్లా, అనిల్ కుమార్ రెడ్డి, నాగవినూత, సుజాతకు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఎవరూ పోటీ లేకుండా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం మేయర్ వసీం మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో పాలకవర్గం ముందుంటుందన్నారు. తామంతా ఐక్యంగా ముందుకెళ్తున్నామనడానికి ప్రస్తుతం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలే నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి 48 మంది కార్పొరేటర్లు ఎంపికయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, సూచనలు, సలహాలతో మేమంతా కలసి కట్టుగా నడుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లోని కార్పొరేటర్లు మేయర్లు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. అయితే అనంతపురంలో అలాంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయం మేరకే తామంతా ముందుకెళ్తామన్నారు. కొందరు రాజ్యసభ సభ్యులు మంత్రులుగా పని చేసిన వారు కూడా పార్టీని వీడి టీడీపీలో చేరడం చాలా బాధాకరమన్నారు. పార్టీలో ఒడిదుడుకులు సహజమన్నారు. కష్టకాలంలో మనమంతా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట నడవాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను మరువకూడదన్నారు. నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులు అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, కమల్ భూషణ్, సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు.

'ఎఫ్‌సీ జారీలో ప్రైవేటీకరణ వద్దు



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

అనంతపురం అర్బన్: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీలో ప్రైవేటీకరణ విధానాన్ని తక్షణం నిలిపివేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీఓ 21 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. అనంతపురం ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఆ సంఘం నగర కార్యదర్శి కృష్ణా నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడారు. వాహనాల యజమానులు రవాణా శాఖకు వెళ్లి తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేవారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీ జారీ ప్రక్రియను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సర్వీస్ సెంటర్లలో 13 రకాల పరీక్షలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో వాహన యజమానులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటికే ఆటోమేటెడ్ డ్రైవింగ్ లైసెన్స్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో 75 శాతం మంది ఫెయిల్ అవుతున్నారన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలన్నారు. డ్రైవర్ల సాధికారత సంస్థ ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం రూ.10 వేలు అందిస్తామని ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఫ్రీ బస్ ప్రయాణం వల్ల ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించిన తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ బాబు, శ్రీనివాసులు, నరసింహులు, గోవిందు, బషా, భాగ్యలక్ష్మి, అస్మత్ అమీద, ఆచారి, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురం నగరంలో జరిగే రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులు, జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగతుల్లో భాగంగా సోమవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి విద్యార్థి ప్రదర్శన ఉంటుందన్నారు. 3, 4, 5 తేదీల్లో యాదవ ఫంక్షన్ హాల్‌లో తరగతులు ఉంటాయన్నారు. ప్రారంభ ఉపన్యాసం రాయలసీమ ఉద్యమ నేత భూమన్ చేస్తారని తెలిపారు. తరగతులకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, పి.ప్రసాద్, రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, జిల్లా కోశాధికారి బండారు శంకర్, డివిజన్ కార్యదర్శి తేజ, అధ్యక్షుడు నరేష్, రాఘవేంద్ర, అభి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా రాజేంద్రనాథ్ యాదవ్

అనంతపురం సెంట్రల్: నగర వన్‌టౌన్ సీఐగా రాజేంద్రనాథ్ యాదవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కళ్యాణదుర్గం రూరల్ సీఐగా పని చేస్తున్న ఈయన బదిలీపై వన్‌టౌన్‌కు వచ్చారు.

భక్తిశ్రద్ధలతో హరిద్రాభిషేకం



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంచామృతాభిషేకాలు, శత సర్పసూక్త హరిద్రాభిషేకం నిర్వహించారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకుపూజ, అర్చన, మహా నైవేద్యం, మహా మంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

రైతాంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



రైతు సంఘం జెండా ఆవిష్కరిస్తున్న మల్లికార్జున

రాప్తాడురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో అఖిల భారత కిసాన్ సభ పిలుపు మేరకు జాతీయ కోరికల దినోత్సవం నిర్వహించారు. రైతు సంఘం రాప్తాడు నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటరాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగం లాభసాటిగా మారుస్తామన్న మోదీ నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను తూచా తప్పకుండా అమలు చేస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం బాధాకరమన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైతాంగం తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేస్తున్నారన్నారు.

పెట్టుబడి సాయం ఏదీ?

2024 ఎన్నికల హామీలో భాగంగా టీడీపీ ప్రభుత్వం రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఆ హామీ ఏమైందని నిలదీశారు. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ పెట్టుబడి సాయం గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామకృష్ణ, గిరిజన రాష్ట్ర సంఘం కార్యనిర్వహణ అధ్యక్షుడు వై.ఎల్.రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి బుల్లే నగేష్, నాయకులు నారాయణస్వామి, పొలన్న, వెంకటరాముడు, సుబ్బారాయుడు, పెద్దన్న పాల్గొన్నారు.

దళిత సాహితీ ఉద్యమానికి ఆద్యుడు మద్దూరి



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న రచయితలు

అనంతపురం కల్చరల్: దళిత సాహితీ ఉద్యమానికి బీజం వేసిన వారిలో మద్దూరి మొదటి వ్యక్తి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో జెన్నె వైష్ణవి భాషా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో మద్దూరి నాగేష్ బాబు సమగ్ర సాహిత్య సదస్సు జరిగింది. డాక్టర్ జెన్నె ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బండి నారాయణస్వామితో పాటూ ప్రధాన వక్తలుగా వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎం వినోదిని, సాహితీ విశ్లేషకులు డాక్టర్ ఖాజా, డాక్టర్ కోయి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వర్ధమాన రచయితలు డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డాక్టర్ అంకె శ్రీనివాస్, కొత్తపల్లి సురేష్, నబీరసూల్ తదితరులు మాట్లాడుతూ.. అన్ని రూపాల్లో దళితులపై అణిచివేత దశాబ్దాలుగా కొనసాగిందన్నారు. అంబేడ్కర్ సాహిత్య ప్రభావంలో వారిలో చైతన్యం తెచ్చిన ఘనతతో ఈరోజు అన్ని గొంతులు వినిపిస్తున్నాయన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 19, 20 తేదీల్లో కళ్యాణదుర్గంలో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అనంతపురం జిల్లా నిర్మాణ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయి స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటీష్ పరాయి వలసవాదులను తరిమికొట్టేందుకు వీరోచిత పోరాటం చేసిన భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్‌దేవ్ ఆశయాల సాధనకు ఏఐఎస్ఎఫ్ ఏర్పడిందని గుర్తు చేశారు. విద్యా రంగానికి దేశ బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లాలో సెంట్రల్ యూనివర్సిటీ, కడప ఉక్కు పరిశ్రమ, పెట్రోలియం యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలని కోరారు. అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న నరేంద్ర మోదీ గెలిచాక ఉద్యోగ ఉపాధి కల్పన ఊసే లేదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, వంశీ, నగర అధ్యక్షుడు మంజునాథ్, నగర నాయకులు తారక్, రారాజు, విజయ్, తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

పుట్టపర్తి నారాయణాచార్యులకు నివాళి



పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు

అనంతపురం కల్చరల్: సీమ సాహిత్యానికి ఎనలేని గౌరవం తెచ్చిన కవీంద్రుడు పుట్టపర్తి నారాయణాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. పుట్టపర్తి నారాయణాచార్యులు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక లలిత కళాపరిషత్తులో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఎల్కేపీ అధ్యక్షుడు గాజుల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. సంగీత, సాహిత్యాలు మూర్తీభవించిన పుట్టపర్తి నారాయణాచార్యులు తెలుగు సాహిత్యకారుల్లో అగ్రగణ్యులన్నారు. బహుభాషా కోవిదుడుగా ఆయన కలం నుంచి జాలువారిన శివతాండవం ఆధునిక మహాకావ్యమని పేర్కొన్నారు. పెనుకొండ లక్ష్మీ, జనప్రియ రామాయణం, మేఘదూతం, షాజీ, పండరీ భాగవతం వంటి కావ్యాలు సాహితీలోకానికి ఎంతో పేరు తెచ్చిపెట్టాయన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా అనంతలో జన్మించడం ఇక్కడి వారి అదృష్టమని తెలిపారు. పద్మశ్రీ అందుకున్న మొదటి అనంత వాసి కూడా ఆయనే అని గుర్తు చేసుకున్నారు.

క్రీడాకారుల వెంటే ఉండాలి



మాట్లాడుతున్న బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ సిద్ధేశ్వర్

అనంతపురం కార్పొరేషన్: దులీప్ ట్రోఫీలో పాల్గొనే క్రీడాకారులు లాడ్జీల నుంచి స్టేడియానికి చేరుకునే వరకు క్రీడాకారుల వెంటే ఉండి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని టోర్నీ లైజనింగ్ ఆఫీసర్లను బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ సిద్ధేశ్వర్ ఆదేశించారు. ఆదివారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో లైజినింగ్ అధికారులతో సమావేశమయ్యారు. క్రీడాకారుల భద్రత నుంచి అన్ని విషయాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ రోహిత్‌వర్మ, అడ్మిన్ మేనేజర్ ఆదిత్య వర్మ, లాజిస్టిక్ మేనేజర్ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

పీజీ విద్యార్థుల కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఎస్వీయూ అటానమస్ పీజీ సెంటర్‌లో 1978–80 బ్యాచ్ ఎంకామ్ విద్యార్థులు 45 ఏళ్ల తర్వాత కలిశారు. ఆదివారం కళ్యాణదుర్గం రోడ్డులోని 'సెర' సంస్థలో సమావేశమయ్యారు. ఈ బ్యాచ్‌లో చదివిన 60 మంది విద్యార్థుల్లో ఎక్కువగా కాలేజీ, యూనివర్సిటీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లు, ప్రభుత్వ, ప్రభుత్వేతర బ్యాంకుల్లో సీనియర్ జనరల్ మేనేజర్లుగా, ఎల్ఐసీలో వివిధ బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందారు. మాజీ ఎమ్మెల్యే రామాంజనేయులు, కేసీ పెద్దన్న ఈ బ్యాచ్‌లో ఉండడం విశేషం. అనంతరం కురుగుంటలోని పుడమిసిరి మిల్లెట్ హోటల్ ప్రాంగణంలోని ప్రకృతి వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ విందులో పాల్గొన్నారు.

సైద్ధాంతిక ఆలోచనలతోనే జేవీవీ అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

అనంతపురం ఎడ్యుకేషన్: సైద్ధాంతిక ఆలోచనలతోనే జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జేవీవీ జిల్లా వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రచార సంబంధమైన కార్యక్రమాలు చేయడం ద్వారా జేవీవీ వృద్ధి చెందినట్లు కాదన్నారు. ప్రజలను శాస్త్రీయ విజ్ఞానం వైపు మళ్లించినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి వెనక శాస్త్రీయ విజ్ఞానం, శాస్త్రీయ ఆలోచన దాగి ఉందన్నారు. ప్రజల్లో అశాస్త్రీయ భావాలు ఇంకా నెలకొని ఉన్నాయన్నారు. మూఢాచారాలకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు రంగన్న, సాకే భాస్కర్, జిల్లా నాయకులు డాక్టర్ పి.ప్రసూన, గాంగేనాయక్, వీరరాజు, రామిరెడ్డి, చిత్తప్ప, జగదీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సేద్యం' ప్రివ్యూ

అనంతపురం కల్చరల్: జిల్లా వాసులు నిర్మించిన 'సేద్యం' చిత్రాన్ని ఆదివారం స్థానిక చోటూ మహారాజ్ మినీ థియేటర్‌లో ప్రదర్శించారు. వ్యవసాయం అనేది చరిత్రలో మిగిలిపోకుండా మనిషిని నిరంతరం కాపాడే జీవనాడి కావాలనే నేపథ్యంలో నిర్మించిన చిత్ర ప్రివ్యూ అందరినీ ఆకట్టుకుంది. ఈనెల 6న చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్ర సమర్పకులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్ కుమార్ రెడ్డి, సినీ, బుల్లితెర నటుడు రమేష్ నీల్, దర్శకుడు చంద్రకాంత్, ఛాయాగ్రాహకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నిర్మాతలు మహేష్‌రెడ్డి, గాజుల పద్మావతి, సహ నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి, కొరియోగ్రాఫర్ వినోద్, నటులు తరిమెల రాజు, శ్రీనివాస్, ఆశ్రయ వృద్ధాశ్రమం నిర్వాహకుడు కృష్ణారెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రియేటర్ కృష్ణ, సపారె రాజశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే మైనార్టీల అభ్యున్నతి

అనంతపురం కార్పొరేషన్: మహానేత వైఎస్సార్ పరిపాలనదక్షుడు. ముస్లిం మైనార్టీలు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారని మేయర్ వసీం పేర్కొన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిరక్షరాస్యత, పేదరికం, తదితర ఆర్థిక సమస్యలతో చితికిపోతున్న ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మైనార్టీలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన తీసుకువచ్చిన రిజర్వేషన్‌తోనే ఎంతో మంది ముస్లిం పిల్లలు ఉన్నత స్థాయికి చేరారన్నారు. ఆరోగ్య శ్రీ, 108, 104, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలతో పేదలకు అండగా నిలిచారన్నారు.

'వైఎస్సార్ కుటుంబానికి మైనార్టీలు రుణపడ్డారు'

వైఎస్సార్ కుటుంబానికి ముస్లిం మైనార్టీలు రుణపడి ఉన్నారని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. వేలాది మంది ముస్లిం మైనార్టీల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి వైద్యులు, ఇంజినీర్లు, అధికారులుగా ఎదిగారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. తద్వారా మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగారని తెలిపారు.

యుద్ధాలు వద్దు.. శాంతి కావాలి



మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

అనంతపురం అర్బన్: యుద్ధాలు వద్దు.. శాంతి కావాలి అంటూ సీపీఎం, దాని అనుబంధ ప్రజాసంఘాలు ఆదివారం నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాయి. సీపీఎం, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీఎస్ఎం ప్రజాసంఘాలు నాయకులు, కార్యకర్తలు స్థానిక లలిత కళాపరిషత్ నుంచి టవర్ క్లాక్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడున్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడారు. పాలస్తీనా, ఉక్రెయిన్‌లో యుద్ధాలను అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ క్రమంలో ఇజ్రాయిల్ దేశానికి ఆయుధాలను అమెరికా సమకూరుస్తోందన్నారు. యుద్ధాల వద్ద దేశాలు, ప్రాంతాలు, ప్రజలు తీవ్రంగా నష్టపోయి అభివృద్ధి వేల ఏళ్ల వెనక్కి పోతుందన్నారు. ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగమణి, చంద్రిక, గోపాల్, రాజమోహన్, రామాంజనేయులు, వెంకటనారాయణ, రామిరెడ్డి, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: వర్షాకాలంతో పాటు సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, అతిసార ప్రబలే రోజుల్లో జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, తదితర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి పీహెచ్‌సీ వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీహెచ్‌సీల పరిధిలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌లకు వచ్చే వారికి అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రధానంగా వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గర్భిణులు, బాలింతలకు అందించే సేవల్లోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ నారాయణ స్వామి, మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజు, కిరణ్, వెంకటేష్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.